

కార్లను అద్దెకు తీసుకుని విక్రయం

యజమానుల వద్ద కార్లను నెలవారీగా అద్దెకు తీసుకుని విక్రయిస్తున్న ఓ కేటు గాడిని పోలీసులు అరెస్టు చేశారు. - 10లో



'కామినేని'లో ఉచిత వైద్యసేవలు

60 ఏళ్లు పైబడిన వయో వృద్ధులకు నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నారు. - 12లో



అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

అధికారమే లక్ష్యంగా పనిచేయాలని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి సయ్యద్ ఖాలిద్ అహ్మద్ పిలుపునిచ్చారు. - 12లో

న్యూస్‌రీల్

11న కిషన్‌రెడ్డి రాక!

నల్లగొండ టూటౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఈనెల 11న నల్లగొండకు రాబోతున్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే నిరసన ర్యాలీ, సభలో ఆయన పాల్గొననున్నారు. అలాగే పార్టీ కోర్ కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లో భాగంగా 8వ తేదీన కేంద్రంపై అవిశ్వాస తీర్మానంపై చర్చ ఉన్నందున, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఢిల్లీలోనే ఉండనున్నారు. ఈ క్రమంలో 11వ తేదీన రావడం కుదరపోతే 12వ తేదీన ఆయన జిల్లా పర్యటన ఉండొచ్చని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

8న ఇన్‌స్పైర్ మనక్‌పై అవగాహన సదస్సు

నల్లగొండ: నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ పోటీలను ఆన్‌లైన్ నమోదు చేయుటకు విడుదల చేసిన యాప్‌పై, బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలపై ఈనెల 8న నల్లగొండలో సైన్స్ ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బోల్లారం భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులకు ఉదయం 10 గంటలకు, హెచ్‌ఎంలకు మధ్యాహ్నం 2 గంటలకు నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ ఉన్నత పాఠశాలలో సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ : 9848578845 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పంటల నమోదు పారదర్శకంగా ఉండాలి



పంటల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న డీఏఓ సుచరిత

నల్లగొండ రూరల్: పంటల నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి సుచరిత అన్నారు. నల్లగొండ మండలం అన్నెపర్తి గ్రామంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు చేపడుతున్న పంటల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రతిరైతు వేసిన పంటల వివరాలను సర్వే నంబర్ల వారీగా ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రవన్‌కుమార్, ఏఓ సుమన్‌రామన్, దేవేందర్ పాల్గొన్నారు.

రెండో రోజు రెండు దరఖాస్తులు

నల్లగొండ క్రైం: జిల్లాలోని 155 మద్యం దుకాణాలకు నిర్వహిస్తున్న టెండర్లలో భాగంగా రెండో రోజు శనివారం రెండు దరఖాస్తులు అందినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 13 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. ఈ నెల 21న లక్ష్మీ గార్డెన్‌లో డ్రా పద్ధతిన దుకాణాలు కేటాయించనున్నట్టు తెలిపారు.

రెండు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



దిగువకు పోతున్న నీరు

కేతేపల్లి: జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు శనివారం రెండు క్రస్టు గేట్లను అడుగు మేర పైకెత్తి దిగువకు 1,180 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీకి 2,945 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా నీటిమట్టం 643.30 అడుగుల వద్ద ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 546 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి గేట్ల ద్వారా 16.70 టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేశామని పేర్కొన్నారు.

కమలం వికసించేనా!

ఉమ్మడి జిల్లాలో బీజేపీ ఆశలు ఫలించేనా..

- రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసేందుకు కసరత్తు
- సీనియర్లంతా అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం కావాలని అధిష్టానం ఆదేశం
- ఈ నెల 20 నుంచి చేపట్టబోయే పర్యటనలతో ప్రయోజనమెంత?



భారతీయ జనతా పార్టీ.. సంస్థాగతంగా బలోపేతం అయ్యేందుకు అనేక పాట్లు పడుతోంది. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడం అంత సులభం కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని నేతలు ఎవరికి వారే అన్నట్లుగా ఉండటం, క్షేత్ర స్థాయిలో కార్యకర్తల సమస్యలను తీర్చడంపై శ్రద్ధ చూపకపోవడం, అందుకు అయ్యే ఖర్చుకు వెనుకాడుతుండటం వంటి కారణాలు పార్టీ బలోపేతానికి అడ్డుగా మారుతున్నాయనే అభిప్రాయం పార్టీ శ్రేణుల నుంచే వ్యక్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్లు అంతా పోటీలో ఉండేందుకు సిద్ధం కావాలని, రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఈ నెల 20 నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహించాలని ఇటీవల ఢిల్లీలో ఎంపీలతో జరిగిన సమావేశంలో బీజేపీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో పార్టీ ఆలోచన ఒక తీరుగా ఉంటే ఉమ్మడి జిల్లాలో వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయి. రాష్ట్ర పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలను సక్సెస్ చేయడంలోనూ జిల్లా నేతలు వెనుకంజలో ఉన్నట్లు ఆ పార్టీ రాష్ట్ర నాయకులే చెబుతున్నారు. పైగా పార్టీ కోసం గట్టిగా నిలబడి పనిచేసే నాయకులు రెండు మూడు నియోజకవర్గాల్లో మినహా మిగతా చోట్ల లేరన్న వాదన ఉంది. తెలంగాణ వచ్చాక ఉమ్మడి జిల్లాలో ఒక్క చోట కూడా పార్టీ అభ్యర్థి విజయం సాధించలేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బండి సంజయ్ పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీకి ఊపును తేగలిగారు. మునుగోడు ఉప ఎన్నికలో నువ్వా.. నేనా అన్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ తలపడ్డాయి. అయినా కమలం పార్టీ గెలువలేకపోయింది. పార్టీకి వచ్చిన ఊపును.. కొత్త అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి వచ్చిన తరువాత కొనసాగించడంలో ఉమ్మడి జిల్లాలోని నేతలు ఎంతమేరకు సక్సెస్ అవుతారు, సంస్థాగతంగా పార్టీని ఏ మేరకు బలోపేతం చేస్తారన్నది వారి కార్యాచరణను బట్టే ఉండనుంది.

మునుగోడు మినహా మిగతా చోట్ల అంతంతే..

- మునుగోడు నియోజకవర్గంలో తప్ప బీజేపీకి ఏ నియోజకవర్గంలోనూ పెద్దగా పట్టు లేదు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరి మునుగోడు ఉప ఎన్నికలో పోటీ చేసిన విషయం తెలిసిందే. ఉప ఎన్నికల్లో ఓడిపోయినా సాధారణ ఎన్నికలో మాత్రం రాజగోపాల్‌రెడ్డి బీజేపీ నుంచి పోటీ చేస్తే విజయం సాధిస్తారనే చర్చ సాగుతోంది.
- నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. పార్టీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి సతీమణి నివేదితరెడ్డి 2018 ఎన్నికల్లో పోటీ చేసినా పెద్దగా ఓట్లు రాలేదు.ఆశావహులు ఉన్నా పెద్దగా అక్కడ వర్కవుట్ కాదనే వాదన పార్టీ వర్గాల్లోనే ఉంది.
- దేవరకొండ నియోజకవర్గంలోని పీఏపల్లి మినహా దేవరకొండ, చందంపేట, చింతపల్లి, మల్లేపల్లి, డిండి మండల కేంద్రాల్లో బీజేపీ కేడర్ ఉన్నా పార్టీ విస్తరణకు చర్యలు పెద్దగా లేవు. గత ఎన్నికల్లో పోటీ చేసిన కల్యాణ్‌నాయక్, కేతావత్ లాలూనాయక్ టికెట్ ఆశిస్తున్నా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఢీకొనే పరిస్థితి కనిపించడం లేదు.
- మిర్యాలగూడలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేను ఢీకొనే పరిస్థితి కనిపించడం లేదు. పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలు గానీ పెద్దగా లేవు.
- నకిరేకల్ నియోజకవర్గంలో పార్టీ నామమాత్రంగానే ఉంది. పార్టీని అభివృద్ధిలోకి తీసుకురాగలిగే పరిస్థితి పెద్దగాకనిపించడం లేదు.
- హుజూర్‌నగర్‌లో పార్టీకి పట్టు అంతంతే. పార్టీ సూర్యాపేట బీజేపీ అధ్యక్షుడుభాగ్యరెడ్డి లేదంటే గట్టు శ్రీకాంత్‌రెడ్డి పోటీ చేస్తారని భావి స్తున్నా, అక్కడ బీఆర్ఎస్ కాంగ్రెస్ బలంగా ఉన్నాయి.
- తుంగతుర్తిలో బీజేపీ పరిస్థితి నామమాత్రమే. గత ఎన్నికలో పోటీ చేసిన కడియం రామచంద్రయ్య క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నా బీఆర్ఎస్‌కు దీటుగా నిలిచే పరిస్థితి లేదు.
- కోదాడ నియోజకవర్గంలోనూ పార్టీ నామమాత్రంగానే ఉంది. ఉన్న నాయకులు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.
- ఆలేరు నియోజకవర్గంలో పట్టణ ప్రాంతాల్లోనే బీజేపీ మెరుగ్గా ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా లేదు. బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పడాల శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన సూదగాని హరిశంకర్‌గౌడ్ కొత్తగా పార్టీలో చేరినవారే.
- భువనగిరి నియోజకవర్గంలో పార్టీ సీనియర్ నేత గూడురు నారాయణరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు వంటి నేతలు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నా, బీఆర్ఎస్ పార్టీని ఢీకొనే స్థాయికి చేరతారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

- నల్లగొండ నియోజకవర్గంలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్లే వచ్చినా పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఓటింగ్ శాతం కొంత పెరిగింది. ప్రస్తుతం బీజేపీ నుంచి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, కన్మంత్‌రెడ్డి శ్రీదేవిరెడ్డి పోటీ విషయంలో ముందువరుసలో ఉన్నారు. నాగం వర్షిత్‌రెడ్డి కూడా ఆశిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలే ఇక్కడ బలంగా ఉన్నాయి. వాటికి దీటుగా పార్టీని ఎలా ప్రజలకు దగ్గర చేస్తారో చూడాలి.

- సూర్యాపేట నియోజకవర్గంలో పార్టీకి ఆశించిన స్థాయిలో పట్టు కనిపించడం లేదు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు. గత ఎన్నికల్లో రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయినా నియోజకవర్గంలో పార్టీ కోసం పని చేస్తున్నారు. అయినా బీఆర్ఎస్, కాంగ్రెస్‌తో బీజేపీ విస్తరణలో పోటీ పడలేకపోతోంది.

రూ.లక్ష ఆర్థికసాయానికి రూ.36 కోట్లు విడుదల

నల్లగొండ టూటౌన్: బీసీ, ఎంబీసీ, సంచార జాతులకు చెందిన వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.లక్ష ఆర్థికసాయం పథకానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు రూ.36కోట్ల నిధులు విడుదల చేసిందని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని బీసీ కుల వృత్తులకు రూ.లక్ష సాయం కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.308 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. లక్ష సాయానికి నిధులు విడుదల చేసిన సీఎం కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్నేహంలో స్వార్థం ఉండదు..

- ఎస్పీ అపూర్వరావు





ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహం గొప్ప నెట్‌వర్క్. భవిష్యత్‌కు మంచి మార్గనిర్దేశం. జీవిత లక్ష్యాలను చేరుకునేలా వెన్నుతట్టి నిలిస్తుంది. స్నేహంలో స్వార్థం ఉండదు. మనకు ఏ సమస్య వచ్చినా వారి సమస్యగా భావించి భరోసా కల్పించి బాధ్యతగా ఉండేవారే అసలైన స్నేహితులు. యువత సామాజిక మాధ్యమాల స్నేహాలను నిశితంగా పరిశీలించాలి. వాటిలో నిజాయితీ కంటే మోసమే ఎక్కువగా ఉంటుంది. మంచి స్నేహితులను ఎంచుకుంటే క్రమశిక్షణ అలువడి జీవిత ఆశయం నెరవేరుతుంది. ఏ సమస్య వచ్చినా మొదటగా చెప్పుకునేది స్నేహితులకే. ఆ తర్వాతనే కుటుంబ సభ్యులకు చెబుతాం.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయాలి



మిర్యాలగూడ గోదాములో బియ్యాన్ని పరిశీలిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ, మిర్యాలగూడ: జిల్లాలోని అన్ని రేషన్ షాపుల్లో ఈ నెల 11వ తేదీ నుంచి పోషకాహార విలువలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేయాలని డీఎస్ఓ వెంకట్వేర్లు ఆదేశించారు. శనివారం ఆయన నల్లగొండ, తిప్పర్తి, మిర్యాలగూడలోని పలు మిల్లులు, ఎఫ్‌సీఐ గోదాములను తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10లోపు అన్ని రేషన్ దుకాణాలకు ఫోర్టిఫైడ్ బియ్యం చేర్చాలని, 11 నుంచి కార్డుదారులందరికీ పంపిణీ చేయాలన్నారు. మిల్లర్లంతా సీఎంఆర్ వెంటనే అప్పగించాలని ఆదేశించారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ డీఎం నాగేశ్వర్‌రావు, డీటీసీఎస్ జావిద్ ఉన్నారు.

- 'ఆర్టీసీ' నిరసన పర్వం



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడాన్ని ఖండిస్తూ శనివారం నల్లగొండ బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆ సంస్థ ఉద్యోగులు, కార్మికులు

కొత్త మండలంగా గుడిపల్లి

- జిల్లాలో 33కు చేరిన మండలాల సంఖ్య

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కొత్త మండలంగా గుడిపల్లిని ఏర్పాటు చేయాలని ఏడాది కాలంగా ఆందోళన చేస్తున్న స్థానిక ప్రజల కల నెరవేరింది. దేవరకొండ నియోజకవర్గం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని 11 గ్రామాలతో గుడిపల్లిని కొత్త మండలంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ప్రాథమిక నోటిఫికేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు లేదా ఉర్దు లేదా ఇంగ్లిషు భాషల్లో జిల్లా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీనిపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరించాలని అందులో పేర్కొన్నారు. తాజా ఉత్తర్వులతో జిల్లాలోని మండలాల సంఖ్య 33కు చేరుకోనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 2016 అక్టోబరులో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం 31 మండలాలతో నల్లగొండ జిల్లాను ఏర్పాటు చేసింది. ఇక గత ఏడాది సెప్టెంబరు 26వ తేదీన గట్టుప్పల్ మండలాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మండలాల సంఖ్య 32కు చేరగా, తాజాగా గుడిపల్లి మండల ఏర్పాటుతో వాటి సంఖ్య 33కు చేరుకుంది. ఈ మండల పరిధిలోకి చిల్కమర్రి, రోల్లకల్, సూరేపల్లి, గుడిపల్లి, ఘట్‌నెమలిపూర్, మాదాపూర్, పాల్కంపల్లి, భీమన్‌పల్లి (పి), కొప్పోల్, ఘన్‌పల్లి, కేశంనేనిపల్లి గ్రామాలను చేరాయి. ఈ మండల ఏర్పాటు కోసం ఏడాది కాలంగా స్థానికులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

రెవెన్యూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు

- జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు

రామగిరి(నల్లగొండ): రెవెన్యూ చట్టాలపై న్యాయమూర్తులు, న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన జడ్జి ఎం.నాగరాజు అన్నారు. శనివారం జిల్లా కోర్టులో నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు రెవెన్యూ చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రెవెన్యూ చట్టాల నిపుణుడు సునిల్ మాట్లాడుతూ వివిధ ల్యాండ్ చట్టాలు, సాదాబైనామా, ధరణిలో ఎదురయ్యే సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో వివరించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నోముల భగత్ తీరు విచారకరం

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నాగార్జునసాగర్: సమస్యను విన్నవించేందుకు వెళ్లిన గిరిజన యువకుడిపై హాలియాలోని తన నివాసంలో ఎమ్మెల్యే నోముల భగత్ చేయిచేసుకోవడం విచారకరమని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. శనివారం నాగార్జునసాగర్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దవూర మండలం నిమ్మానాయక్ తండా గ్రామపంచాయతీ నుంచి మల్లెవానికుంట తండాను విడదీయొద్దని విన్నవించిన గిరిజన యువకుడు భాస్కర్‌నాయక్ జుట్టుపట్టి కొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. గిరిజన యువకుడిపై చేయి చేసుకున్న ఎమ్మెల్యేభగత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలను విన్నవించేందుకు ప్రజలు.. ఎమ్మెల్యే దగ్గరకు వెళతారని, అంతమాత్రానా వారిపై చేయిచేసుకునే హక్కు ఎమ్మెల్యేకు ఉంటుందా? గిరిజనుల ఓట్లతోనే గెలిచి వారిపైనే చేయిచేసుకుంటారా అని నిలదీశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ తిరుమలగిరి సాగర్ మండల అధ్యక్షుడు రమావత్ కృష్ణనాయక్, పార్టీ అడవిదేవులపల్లి మండల అధ్యక్షుడు బాలునాయక్ తదితరులు ఉన్నారు.

కష్ట సుఖాల్లో తోడుండేదే స్నేహం

- స్నేహితులకే అన్ని విషయాలు చెబుతాం
- ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌తో చివరకు విషాదమే..
- మంచి స్నేహితులు ఉండడం గొప్పవరం
- 'సాక్షి' టాక్ షోలో నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల మనోగతం

నేడు స్నేహితుల దినోత్సవం




నల్లగొండలోని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన టాక్ షోలో పాల్గొన్న విద్యార్థినులు



నల్లగొండ రూరల్: స్నేహంలో స్వార్థం ఉండదు. కులం, మతం, డబ్బు, హోదాకు తావుండదు. ఏదైన సమస్య ఉంటే తల్లిదండ్రుల కంటే ముందుగా స్నేహితులతోనే పంచుకుంటాం. స్నేహం అంటే మరణం వరదూ వీడని బంధంగా ఉంటుంది. ఎక్కడ ఉన్నా ఏ విషయమైనా ప్రాణస్నేహితునితోనే చర్చించి నిర్ణయం తీసుకుంటాం. కష్ట సుఖాల్లో జీవితాంతం తోడుండేదే నిజమైన స్నేహమని అంటున్నారు నల్లగొండ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు. రక్త సంబంధం కంటే స్నేహ సంబంధమే బలంగా ఉంటుంది. జీవితంలో మంచి స్నేహితులను కలిగి ఉండడం గొప్పవరం. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు నాకు మంచి స్నేహితులు ఉన్నారంటూ భరోసా కల్పించేదే స్నేహం. ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో సాక్షి నిర్వహించిన టాక్ షోలో పలువురు విద్యార్థినులు స్నేహం గురించి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆన్‌లైన్ స్నేహంలో నిజాయితీ ఉండదు. చివరకు విషాదమే మిగులుతుందని తెలిపారు. కపట స్నేహాన్ని నమ్మొద్దని అంటున్నారను. వివరాలు వారి మాటల్లోనే..


ఆన్‌లైన్ స్నేహాలు మంచిది కాదు



ఆన్‌లైన్ స్నేహం మంచిది కాదు. సామాజిక మాధ్యమాల్లో ఫాలో వర్స్ కోసం ఫ్రెండ్ రిక్వెస్టులు అంగీకరించి వారితో స్నేహం చేయొద్దు. మొదట మంచిగా మాట్లాడుతూ తర్వాత అవసరాలకు డబ్బులు అడుగుతూ అనేక రకాలుగా ఇబ్బందులు పెడతారు. ఇలాంటి స్నేహంతో విషాదమే మిగులుతుంది.

- పార్వతి, మహిళా డిగ్రీ కళాశాల,నల్లగొండ

పూర్తిగా అర్థం చేసుకోవాలి



ఇన్‌స్టా గ్రామ్ ఫ్రెండ్‌షిప్ అంతా మోసమే ఉంటుంది. సామాజిక మాధ్యమాల్లో ద్వారా పరిచయమయ్య స్నేహితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పూర్తిగా అర్థం చేసుకోకుండా స్నేహం చేస్తే మానసింగా శారీరకంగా ఆర్థికంగా నష్టం జరుగుతుంది. చాలా జాగ్రత్తగా ఉండాలి.

- షామిలి, విద్యార్థిని


స్నేహంలో మోసం ఉండరాదు



స్నేహంలో కులం, మతం, హోదాలు, ఏవి అడ్డురావు. స్నేహంలో మోసం ఉండరాదు. నాతో పాటు నా ఫ్రెండ్ బాగుండాలి. మంచి భవిష్యత్ ఉండాలి అని కోరుకునేవారే నిజమైన స్నేహితులు. మన రహస్యాలన్నీ మొదటగా ఫ్రెండ్‌కే తెలుపగలుగుతాం.

- వహిదాబేగం, విద్యార్థిని

మంచి స్నేహితులను ఎంచుకోవాలి



చెడు నుంచి మంచి వైపు మార్చేవారే నిజమైన స్నేహితులు. చెడు అలవాట్లు లేని స్నేహితులు ఉంటే మంచి మార్గం వైపు పయనించి ఉజ్వల భవిష్యత్‌ను చేజిక్కించుకుంటాం. చెడ్డ వారితో స్నేహం భవిష్యత్ అంధకారంగా మారుతుంది. స్నేహంలో మంచి వారిని ఎంచుకోవాలి.

- పావని, విద్యార్థిని


నమ్మకమే స్నేహం



ఏ విషయాన్నైనా తల్లిదండ్రుల కంటే ముందుగా స్నేహితునితోనే పంచుకుంటాం. కుటుంబ సభ్యులకంటే ఎక్కువగా స్నేహితులకే మొదటగా అన్ని విషయాలు చెబుతాం. ఆ తర్వాతే తల్లిదండ్రులతో మాట్లాడుతాం. స్నేహం అంటే బాధ్యత కూడిన నమ్మకమైన భరోసా.

- శివాంజలి, విద్యార్థిని


స్నేహబంధాన్ని మాటల్లో చెప్పలేము



స్నేహం విలువైనదిగా ఉండాలి. భరోసాగా, బాధ్యతగా ఉండాలి. స్నేహబంధాన్ని మాటల్లో చెప్పలేము. మొదటి నుంచి చివరి వరకు అండగా నిలిచేదే స్నేహం. ఎల్లప్పుడు మనకు మంచి చేసేలా మంచి నడవడికతో ముందుకు సాగించే వారే నిజమైన స్నేహితులు.

- అయిషా, అధ్యాపకురాలు


స్నేహితులను బట్టే గౌరవమూ లభిస్తుంది



ప్రతి ఒక్కరికి స్నేహబంధం ఉంటుంది. కానీ ఆ స్నేహం మంచి వారితో ఉంటే భవిష్యత్ లక్ష్యాల సాధనలో ముందుంటారు. మంచి స్నేహితులతో స్నేహబంధం కొనసాగిస్తూ చెడు స్నేహితులకు దూరంగా ఉండాలి. వ్యక్తిగతంగా కూడా స్నేహితులను బట్టే గౌరవం లభిస్తుంది.

- అంజికా, విద్యార్థిని

సమస్యకు పరిష్కారం చూపేదే స్నేహం



ప్రతి సమస్యను తన సమస్యగా భావించి మంచి మార్గనిర్దేశం చేసేవారే అసలైన స్నేహితులు. అన్ని విషయాల్లో బాధ్యతగా అండగా నిలిస్తూ.. సమాజంలో గౌరవంగా ఉండే విధంగా చేసేదే స్నేహం. అవసరం కోసం చేసే స్నేహం స్వార్థపూరితం అవుతుంది.

- ఐషా విద్యార్థిని

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


బుచ్చిరెడ్డి (ఫైల్)

చిట్యాల: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతిచెందాడు. చిట్యాల మండలం ఏపూరు గ్రామానికి చెందిన ఎంపల్ల బుచ్చిరెడ్డి (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుచ్చిరెడ్డి రోజూ వారీగా శనివారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. పొలానికి నీరు పెట్టేందుకు బోరు మోటారు వద్దకు వెళ్లాడు. బోరుకు విద్యుత్‌ను సరఫరా చేసే వైరు కిందపడి ఉండగా బుచ్చిరెడ్డి దానికి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో వైరు ప్రమాదవశాత్తు బుచ్చిరెడ్డికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

రామగిరి(నల్లగొండ): అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. తిప్పర్తికి చెందిన గంగనబోయిన కోటమ్మ(56) వ్యవసాయ మార్కెట్‌లో స్వీపర్‌గా పని చేస్తోంది. కొంత కాలంగా కోటమ్మ మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌ని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మోకాళ్ల మార్పిడి చేయించుకుంది. ఆరోగ్య పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు మృతి

మర్రిగూడ : పురుగుల మందు తాగిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిగూడ మండలం కమ్మగూడ గ్రామానికి చెందిన మార్నేని స్టీఫెన్(68) భార్య ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందింది.దీంతో ఒంటరి జీవితాన్ని తట్టుకోలేక స్టీఫెన్ ఈనెల 3న పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కలరు. కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

నేస్తం.. సమస్తం





నల్లగొండలో ఫ్రెండ్‌షిప్‌డే సెలబ్రేషన్స్‌లో విద్యార్థినులు


పైయిడిమర్రి నారాయణరావు, ఎండీ.షరీఫ్

వ్యాపారంతో ఒక్కటిగా..

కోదాడ : చిన్నతనంలో చిగురించిన వారి స్నేహం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతోంది. విద్యార్థులుగా, వ్యాపార భాగస్వాములుగా వారి స్నేహం కుల మతాలకు అతీతంగా నిలిచి ఉంది. తాము చేస్తున్న వ్యాపారానికి 'ఆదర్శం' అని పేరు పెట్టుకోవడం ఆలోచింపజేస్తుంది. వారే కోదాడకు చెందిన పైయిడిమర్రి నారాయణరావు, ఎండీ షరీఫ్. నారాయణరావుది కోదాడ కాగా ఎండీ.షరీఫ్‌ది గుడిబండ. వీరిద్దరూ కోదాడ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి నుంచి సహ విద్యార్థులు. చదువు పూర్తయిన తరువాత ఇద్దరు కలసి కోదాడ లోని బొడ్రాయి బజార్‌లో 1987లో ఆదర్శ మెడికల్స్ పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 36 సంవత్సరాలుగా ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా వ్యాపారాన్ని నిర్వహించుకుంటున్నారు. ఇద్దరివి వేర్వేరు మతాలు అయినా వీరి స్నేహానికి అడ్డురాలేదు. పండుగలు, పర్వదినాల్లో ఒకరి ఇంటికి మరొకరు వెళుతూ స్నేహానికి మతాలతో సంబంధం లేదని నిరూపిస్తున్నారు. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవడమే తమ స్నేహబంధానికి కారణమని చెపుతున్న ఈ స్నేహితులకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలపకుండా ఉండగలమా..!

ఆపదలో అండగా..


ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు (ఫైల్)

మునుగోడు : తమ స్నేహితులు ఏదైనా ఆపదలో ఉన్నారని తెలిసిన వెంటనే అందరూ స్పందించి తమ శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తున్నారు మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మిదేవిగూడెం గ్రామానికి చెందిన యువకులు. ఆ గ్రామానికి చెందిన 45 మంది యువకులు తమలో ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా ఆ వ్యక్తికి అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. 2008లో శివాజీ యువజన సంఘం ఏర్పాటు చేసుకుని.. తమ సంఘంలో కొంత నగదు నిల్వ ఉంచుతున్నారు. తమ స్నేహితుల్లో ఎవరికి ఆపద వచ్చినా మేమున్నామంటూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. 12 ఏండ్ల కాలంగా వారు రూ.5 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందజేశారు. స్నేహితులు అంటే ఇలా ఉండాలని అనేలా మన్ననలు పొందుతున్నారు.

స్నేహితుల కుటుంబాలకు ఆసరాగా..


రాము కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న మిత్రులు(ఫైల్)

నిడమనూరు : చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు స్నేహితులయ్యారు. తమ స్నేహాన్ని ఎల్లకాలం నిలుపుకునేందుకు ఆపదలో ఉన్న స్నేహితులకు అండగా ఉంటున్నారు. నిడమనూరు మండలంలోని నిడమనూరు, బంకాపురం, తుమ్మడం గ్రామాలకు చెందిన పున్నా శంకర్, వెంకన్న, రాము, శ్రీను, కొండల్, రాంబాబు, శశి, జానయ్య స్నేహితులు బంకాపురం గ్రామానికి చెందిన సింగరాల శశికుమార్ (24) అనారోగ్యంతో మృతి చెందాడు. అవివాహితుడు కావడంతో శశికుమార్ తల్లిదండ్రులకు స్నేహితులు రూ.30 వేలు అందించారు. స్నేహితుల్లో ఒకరైన తుమ్మడం గ్రామానికి చెందిన కొయ్య రాము మార్చి నెలలో కాలువలో పడి మృతి చెందాడు. రాము కుటుంబానికి రూ.లక్షా 70 వేలు అందజేశారు. ఆపదలో ఉన్న స్నేహితుల కుటుంబాలకు అండగా నిలబడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

అండగా.. ఆల్ మై ఫ్రెండ్స్

దేవరకొండ : ఆల్ మై ఫ్రెండ్స్.. ఆ పేరులోనే ఉంది అందరూ నా స్నేహితులే అనే అర్థం. ఈ పేరుకు తగ్గట్టే వారంతా ఒక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని తమ స్నేహితులకు తోచిన సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగుతున్నారు. దేవరకొండ జెడ్పీహెచ్‌ఎస్ 1989–1990 బ్యాచ్‌కు చెందిన 84 మంది పదో తరగతి విద్యార్థులు ఆల్ మై ఫ్రెండ్స్ పేరిట 2015లో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొంతమంది విదేశాలతో పాటు వివిధ పట్టణాల్లో స్థిరపడ్డారు. తమతో పాటు చదువుకున్న స్నేహితులకు ఆర్థికపరమైన ఇబ్బందులు, ఆపద సమయాల్లో అండగా నిలుస్తున్నారు. మొదట్లో గ్రూప్ సభ్యులకు సహాయ సహకారాలు పరిమితం కాగా ప్రస్తుతం విస్తృతమయ్యాయి. గతేడాది దేవరకొండకు చెందిన శ్రీకాంత్ పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్య సాయం కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విదేశాల్లో ఉన్న గ్రూప్ సభ్యుడైన నల్లమాద దేవేందర్‌రెడ్డి.. విదేశాల్లో స్థిరపడిన తన స్నేహితుల ద్వారా సమకూర్చిన రూ.5.30 లక్షలు అందించి తమ ఉదారతను చాటుకున్నారు. అంతేకాకుండా ఇటీవల తమ స్నేహితుడైన కర్నాటి ఆంజనేయులు అనారోగ్యానికి గురికావడంతో గ్రూప్ సభ్యులందరూ కలిసి రూ.లక్ష ఆర్థిక సాయంగా అందజేశారు. గతేడాది తమ స్నేహితుడైన కృష్ణమాచారి అనారోగ్యంతో మృతి చెందడంతో అతని కుటుంబానికి అండగా నిలిచి గ్రూప్ సభ్యులు రూ.1.80 లక్షలు అందజేశారు. రానున్న రోజుల్లో తమ సేవలను మరింత విస్తృతం చేసేందుకు వారంతా ముందుకు సాగుతున్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)


మిత్రుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న స్నేహితులు (ఫైల్)

ఓపెన్ ఐస్ సొసైటీ సాయం

హుజూర్‌నగర్ : ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఒక్కటయ్యారు హుజూర్‌నగర్‌కు చెందిన మిత్రులు. ఓపెన్‌ఐస్ సొసైటీ ఏర్పాటు చేసి సొంతంగా కొంత సొమ్మును జమ చేసి పేదలకు సాయం చేయడం ప్రారంభించారు. వారికి మరి కొందరు మిత్రులు తోడయ్యారు. హుజూర్‌నగర్‌లో రెండేళ్లక్రితం అనారోగ్యంతో మృతి చెందిన బాలబోయిన వెంకన్న కుటుంబానికి రూ.3.10 లక్షలు అందజేశారు. గత ఏడాది చనిపోయిన వీసం మధు కుటుంబ సభ్యులకు రూ.లక్ష అందజేశారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న బైరం వెంకయ్య వైద్య ఖర్చుల కోసం రూ. లక్ష అందజేశారు. కాలేయ వ్యాధితో బాధపడుతూ ఐసీయూలో ఉండి చికిత్స పొందుతున్న అరుణ్‌కుమార్ రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసారు. అంతే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ బుక్స్, ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తున్నారు. స్నేహితుల కోసం ఏర్పడిన సంఘం ఇతరులకు కూడా ఉపయోగకరంగా మారడంతో పలువురు వారిని అభినందిస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : కోమటిరెడ్డి


నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి

కనగల్ : కార్యకర్తలకు అండగా ఉంటానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కనగల్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్ జగతయ్య శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోమటిరెడ్డి శనివారం జగతయ్య ఇంటి వద్దకు వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి కన్నీటి పర్యంతమయ్యాడు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. జగతయ్య పార్థీవ దేహాన్ని చూడగానే కోమటిరెడ్డి బావోద్వేగానికి లోనయ్యారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

చిట్యాల : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. చిట్యాల, గుండాల, మర్రిగూడ మండలాల పరిధిలో చోటు చేసుకున్నట్లు ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కసనబోయిన నర్సయ్య(50) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. ఎవరికీ చెప్పకుండా ఇంటినుంచి వెళ్లి ఆయా గ్రామాల్లో తిరుగుతున్నాడు. నర్సయ్య శనివారం చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో దొడ్ల డైయిరీ ఎదురుగా నడుచుకుంటూ జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న ట్యాంకర్ నర్సయ్యను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇరుగు రవి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి..


నవీన్ (ఫైల్)

గుండాల : గుండాల మండలం మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన గుబ్బ మురళీ, సువర్ణ దంపతుల పెద్ద కుమారుడు గుబ్బ నవీన్ (23) మిర్యాలగూడ మండలం తడకమల్ల గ్రామంలో ఉంటున్న అమమ్మ ఇంట్లో పెరుగుతున్నాడు. నవీన్ కొంతకాలంగా మిర్యాలగూడలోని ఓ ఫొటో స్టూడియోలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన నవీన్ శనివారం ట్రాక్టర్‌తో తమ సొంత పొలాన్ని దున్నాడు. అనంతరం పెదనాన్న పొలాన్ని కూడా దున్నుతుండగా ట్రాక్టర్ దిగబడింది. కల్టివేటర్ ఊడదీసి ట్రాక్టర్ వీల్స్‌లో కర్రలు పెట్టి లేపుతున్న క్రమంలో తిరగబడి నవీన్‌పై పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. నవీన్ మృతితో మాసాన్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ..

మర్రిగూడ : మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామానికి చెందిన సిలివేరు పుల్లమ్మ(53), ముత్తయ్య దంపతులు శుక్రవారం నాంపల్లి మండలం లింగోటం గ్రామంలో తమ సమీప బంధువు దహన సంస్కారాలకు హాజరై బైక్‌పై తిరిగి వస్తున్నాడు. మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయం సమీపానికి చేరుకోగానే డీసీఎం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పుల్లమ్మ మృతిచెందగా ముత్తయ్య పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

చింతపల్లి : పెన్షన్ డబ్బు కోసం తండ్రిని హత్య చేసిన నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఊరె మల్లయ్య(90) శుక్రవారం మధ్యాహ్నం కుమారుడి చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో దర్యాప్తు చేపట్టగా మల్లయ్య కుమారుడు ఊరె బుగ్గయ్య శనివారం చింతపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా పెన్షన్ డబ్బుల కోసమే హత్య చేసినట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు బుగ్గయ్యను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఏఎస్‌ఐ చంద్రారెడ్డి ఉన్నారు.

కార్లను నెలవారీ అద్దెకు తీసుకుని విక్రయం

- పోలీసులకు చిక్కిన కేటుగాడు.. ఏడు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు


స్వాధీనం చేసుకున్న వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

మిర్యాలగూడ అర్బన్: యజమానుల వద్ద కార్లను నెలవారీ అద్దెకు తీసుకుంటాడు.. నమ్మకంగా ఉంటూ వారికి తెలియకుండా కార్లను విక్రయించి జల్సాలు చేస్తున్న ఓ కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు కేసు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణం అశోక్‌నగర్‌కు చెందిన షేక్ వాజిద్ నాలుగేళ్లుగా సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో కార్లను అద్దెకు ఇస్తుండేవాడు. కొంత మందితో నమ్మకం ఏర్పరుచున్న వాజిద్ వారి వద్ద నుంచి 20కార్లు నెలవారీ అద్దెకు తీసుకుని ఆ వాహనాలతో సెల్ఫ్ డ్రైవింగ్ పేరిట అద్దెకు ఇస్తూ ఆదాయం ఆర్జించేవాడు. ఈ క్రమంలో నెలవారీ అద్దెకు తీసుకున్న కార్లను ఏకంగా యజమానులకు తెలియకుండా విక్రయించి సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఓ కారు ఓనర్ తనకు తెలియకుండా విక్రయించాడని గుర్తించి పట్టణంలోని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అసలు విషయం బయట పడింది. దీంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా ఈ విధంగా మొత్తం 9కార్లను హైదరాబాద్‌లోని అలకాపూర్‌కు చెందిన మధ్యవర్తి పోలూరి రాజు ద్వారా విక్రయించినట్లు అంగీకరించాడు. కాగా షేక్ వాజిద్ పై హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, ఐఎస్ సదన్, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్లలోనూ ఇలాంటి కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. అతడి వద్ద నుంచి 7 కార్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

మరో కేసులో ఏడు బైక్‌లు స్వాధీనం

చోరీ కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన గునగుంట్ల చరణ్ అలియాస్ చంటి బైక్ మెకానిక్‌గా పని చేస్తుండేవాడు. మద్యం, గంజాయికి బానిసగా మారి బైక్‌లను అపహరించి అవసరాలను తీర్చుకుంటున్నాడు. పట్టణంలోని ఈదులగూడలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీలు చేస్తున్న వన్‌టౌన పోలీసులకు తారసపడిన చరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌లను అపహరిస్తున్నట్లు అంగీకరించాడు. చెన్నైలో రెండు , హుజూర్‌నగర్, నార్కట్‌పల్లి, తెనాలి, మిర్యాలగూడ వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో ఒక్కో బైక్ చొప్పున చోరీ చేశానని చెప్పాడు. ఆ బైక్‌లను పట్టణంలోని గాంధీనగర్‌లో గల అరవిందా రైస్‌మిల్లు సమీపంలోని చెట్ల పొదల్లో దాచానని చెప్పాడు. దీంతో ఆ బైక్‌లను స్వాధీనం చేసుకుని చరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

శిశువును రక్షించిన పోలీసులు

15 రోజుల శిశువును పోలీసులు రక్షించారు.గత నెల 27న తెల్లవారుజామున ఓ మహిళ 15 రోజుల పాపను కొనుగోలు చేసి తీసుకుని వస్తుందని విశ్వసనీయ సమాచారంతో టూటౌన్ ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ బుచ్చిరెడ్డి, మహిళా కానిస్టేబుల్ ఆదెమ్మ, హోంగార్డు సర్దార్ మిర్యాలగూడలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేపట్టారు. ఓ మహిళ వద్ద రోజుల పాపను గుర్తించి ఆమెను విచారించారు. కొనుగోలు చేసి తెచ్చినట్లు గుర్తించిన పోలీసులు పాపను నల్లగొండలోని చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌కు తరలించారని ఎస్పీ తెలిపారు. శిశువు తల్లిదండ్రులను కూడా గుర్తించామని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ వెంకటగిరి, సీఐలు రాఘవేందర్, నరసింహారావు, ఎస్‌ఐ అనంతు శివతేజ్, కృష్ణయ్య సిబ్బంది ఉన్నారు.